
సాక్షి
రాజన్న సిరిసిల్ల

మంగళవారం | 6 | ఆగస్టు | 2024



అన్నపూర్ణ ప్రాజెక్టుకు నీటి విడుదల

బోయినపల్లి/తంగళ్లపల్లి: మిడ్‌మానేరు నుంచి అన్నపూర్ణ ప్రాజెక్టుకు మంగళవారం 6,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పూజలు చేశారు.



వైభవంగా మహాలింగార్చన

వేములవాడ: రాజన్న ఆలయంలో శ్రావణమాసం మొదటి సోమవారం సందర్భంగా మహాలింగార్చన నిర్వహించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
28.0/26.0

ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

సత్వర న్యాయానికి గ్రీవెన్స్ డే

- ఎస్పీ అఖిల్ మహాజన్



సిరిసిల్లక్రైం: ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై స్పందించి, బాధితులకు సత్వర న్యాయం అందించేలా గ్రీవెన్స్‌డే నిర్వహిస్తున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. వివిధ సమస్యలపై 14 ఫిర్యాదులు స్వీకరించి త్వరగా పరిష్కరించాలని ఆయా పోలీస్‌స్టేషన్ల అధికారులను ఆదేశించారు. గ్రీవెన్స్ డే ఫిర్యాదులు ఏమేరకు పరిష్కారం అయ్యాయో సమీక్షించుకుంటూ మరింత సమర్థంగా సేవలందిస్తున్నామన్నారు.

దోమలు కుట్టకుండా చూసుకోవాలి



సిరిసిల్ల: దోమలు పుట్టకుండా.. కుట్టకుండా చూసుకోవాలని జిల్లా వైద్యాధికారి వసంతరావు కోరారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధుల నివారణ అంశాలపై కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌వో ఆఫీస్‌లో సోమవారం సమావేశమై చర్చించారు. జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వలేకుండా చూసుకోవాలన్నారు. ఇంటింటి సర్వే నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. దోమతెరలు, మస్కిటో కాయిల్స్ ఉపయోగించి దోమలు కుట్టకుండా, పుట్టకుండా నివారించవచ్చని వివరించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో రాజగోపాల్, ఎంపీహెచ్‌వో లింగం, డెమో రాజకుమార్, హెచ్‌ఈ బాలయ్య పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులను నివారించండి



కోనరావుపేట(వేములవాడ): సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి, వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్ సూచించారు. కోనరావుపేటతోపాటు నిజామాబాద్ గ్రామాల్లో సోమవారం పర్యటించారు. నిజామాబాద్‌లో పారిశుధ్య పనులపై సిబ్బందికి సూచనలు ఇచ్చారు. పూర్వవిద్యార్థి అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన తరగతి గదులను పరిశీలించారు. తహసీల్దార్ విజయ్‌ప్రకాశ్‌రావు, ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, సీహెచ్‌వో కృష్ణమూర్తి, మాజీ సర్పంచ్ కేతిరెడ్డి అరుణ, కార్యదర్శి కవిత, సూపర్‌వైజర్ రషీద్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



సిరిసిల్ల: జిల్లా కేంద్రంలో సోమవారం అథ్లెటిక్స్ పోటీలను జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ నిర్వహించింది. 10వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సీనియర్, అండర్-12 బాలబాలికల అథ్లెటిక్స్ పోటీలు మెదక్‌లోని ఇందిరా గాంధీ స్టేడియంలో ఈనెల 10న జరుగనున్నాయి. మినీస్టేడియంలో నిర్వహించిన ఎంపిక పోటీలను జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొజ్జ చంద్రశేఖర్ ప్రారంభించారు. అండర్-12, అండర్-18, అండర్-23 వయసుల వారీగా నిర్వహించిన పోటీల్లో పది మంది క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చిక్కాల రామారావు తెలిపారు. పోటీల్లో విజయం సాధించిన క్రీడాకారులకు మెరిట్ సర్టిఫికెట్‌తోపాటు మెడల్స్ అందించారు. వ్యాయామ ఉపాధ్యాయులు నవీన్, శ్రవణ్‌కుమార్, ఈసీ మెంబర్ నేరెళ్ల గంగాధర్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

జెడ్పీ సీఈవోగా వినోద్

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా జెడ్పీ సీఈవోగా ఎస్.వినోద్‌ను ప్రభుత్వం నియమించింది. రాష్ట్ర వ్యాప్తంగా జెడ్పీ సీఈవోలను, డీఆర్‌డీవోలను బదిలీ చేస్తూ సోమవారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. జెడ్పీ సీఈవోగా వినోద్ విధుల్లో చేరనున్నారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన ఉమారాణికి పోస్టింగ్ ఎక్కడ కేటాయించారో ఆ ఆదేశాల్లో స్పష్టం చేయలేదు.

ఇంధనం ఏది?



- పోలీసు వాహనాలకు పెట్రోల్, డీజిల్ కరువు
- పలు యూనిట్లలో విడుదల కాని రెండో త్రైమాసిక నిధులు
- ఇంధనం కోసం పెట్రోల్ బంకుల్లో పోలీసుల ఉద్దెర ఖాతాలు
- మూడు నెలలుగా సర్దుబాటు చేయలేక ఎంటీవోల తిప్పలు
- రామగుండం, కరీంనగర్ కమిషనరేట్లు, జగిత్యాల, సిరిసిల్ల యూనిట్లలో పరిస్థితి

బంక్ బాయ్: మా సార్ ఉద్దెరకు డీజిల్ పోయొద్దన్నాడు సార్.. పాత బకాయిలు చానా ఉన్నయ్!
డ్రైవర్: ఈసారికి ఖాతాలో రాసుకోవయ్యా.. బిల్లులు రాగానే ఇచ్చేస్తాం!
బంక్ బాయ్: సార్.. ఇదేమాట రెండు నెలలుగా చెబుతున్నారు. మా సేటు డబ్బులు ఇవ్వకపోతే పోయొద్దన్నాడు. ఇదే ఆఖరు సార్.
డ్రైవర్: సరే సరే నింపవయ్యా.. మాసార్ మీ సేటుతో మాట్లాడుతడు లే.. కోర్టుకు వెళ్లే టైమైంది!
– ఇటీవల గోదావరిఖనిలో పోలీసు జీపు డ్రైవర్‌కి, పెట్రోల్ బంకు ఉద్యోగి మధ్య జరిగిన సంభాషణ!

సాక్షిప్రతినిధి, కరీంనగర్:

అత్యవసర సర్వీసుల్లో ముందుండేది పోలీసు శాఖ. శాంతి భద్రతల పరిరక్షణే కాదు.. కరోనా లాంటి విపత్తుల్లోనూ ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించారు. ఏ సమయంలో ఫోన్‌చేసినా.. నిమిషాల్లో ప్రత్యక్షమవుతారు. అలాంటి అత్యవసర సర్వీసు వారికి ఆర్థికంగా ఆపదవచ్చింది. విషయం ఏంటంటే.. పోలీసు సిబ్బంది కొంతకాలంగా వాహనాల్లో ఇంధనానికి డబ్బులు లేక సతమతమవుతున్నారు. ఈ పరిస్థితి కేవలం రామగుండం కమిషనరేట్‌లోనే కాదు, కరీంనగర్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. దాదాపు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పోలీసు యూనిట్లకు పెట్రోల్, డీజిల్‌కు డబ్బులు లేక ఉద్దెర ఖాతా పెడుతున్నట్లు సమాచారం. జగిత్యాల యూనిట్‌లో అయితే ఏకంగా దాదాపు ఐదారునెలలుగా ఇదే పరిస్థితి నెలకొందని పలువురు పోలీసు సిబ్బంది వాపోతున్నారు. ప్రతీసారి బంకు ఉద్యోగులకు సర్దిచెప్పడం లేదా సదరు ఎంటీవోలతో ఫోన్లో హామీ ఇప్పించడం తదితర మార్గాల్లో పోలీసుల వాహనాల్లో ఇంధనం సర్దుబాటు చేసుకుంటున్నారు. రాష్ట్రంలోని పలు యూనిట్లలోనూ ఇదే పరిస్థితి ఉందని తెలిసింది.

ఏంటి సమస్య?

వాస్తవానికి పోలీసు డిపార్ట్‌మెంట్‌కు ఏటా బడ్జెట్లో కొంత మొత్తం కేటాయిస్తారు. ఈ శాఖలో నిర్వహణకే అధికంగా నిధులు కేటాయిస్తారు. అందులో జీతభత్యాలు, పింఛన్లు, రుణాలు, కార్యాలయాల నిర్వహణ, భవనాల మరమ్మతులు, వాహనాల నిర్వహణ తదితరాలు ఉంటాయి. వీటన్నింటిలోనూ వాహన నిర్వహణ చాలాకీలకమైన అంశం. దేశంలోనే ఘటన జరిగిన స్థలానికి కేవలం 9 నిమిషాలలోపు కంటే తక్కువ సమయంలో చేరుకునే ఏకైక డిపార్ట్‌మెంట్ గా తెలంగాణ పోలీసు డిపార్ట్‌మెంటు తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. (డయల్ 100కి ఫోన్ వచ్చిన వెంటనే 9 నిమిషాల్లో, గ్రామాల్లో ఈ సమయం మరింత తక్కువగా ఉంటుంది.) ఇందుకోసం నిరంతరం బ్లూకోల్ట్స్, గస్తీ వాహనాలు (పెట్రో కార్స్) తమ పరిధిలో సంచరిస్తుంటాయి. అంతటి కీలకమైన విభాగానికి నిధుల కొరత తలెత్తడంపై సాక్షాత్తూ సిబ్బంది ఆశ్చర్య పోతున్నారు.

ఏం జరిగింది?

నిధులు సకాలంలో అందకపోవడం వల్లే పోలీసుస్టేషన్లతోపాటు, వాహనాలకు ఇంధనం సమస్య తలెత్తింది. ఈసారి ఫిబ్రవరిలో ఓటాన్ అకౌంట్ పెట్టారు. ఇటీవల పూర్తిస్థాయి బడ్జెట్ వచ్చింది. అందులో పోలీసుశాఖకు కూడా నిధులు ఇచ్చారు. అయితే, యూనిట్లకు పూర్తిస్థాయిలో చేరలేదని సమాచారం. ప్రతీ యూనిట్‌కి పోలీసుస్టేషన్ల సంఖ్య, వాహనాల సంఖ్య, అవి తిరిగే దూరాన్ని బట్టి బడ్జెట్ నిర్ణయిస్తారు. ఈ నిధులు వార్షిక బడ్జెట్ అనంతరం ప్రతీ త్రైమాసికానికి ఓసారి విడుదల చేస్తారు. ఉదాహరణకు మార్చిలో బడ్జెట్ పెడితే.. ఏప్రిల్, మే, జూన్‌ను మొదటి త్రైమాసికంగా, తర్వాత మూడునెలలను రెండో త్రైమాసికంగా తీసుకుని బిల్లులు విడుదలచేస్తారు. అయితే, యూనిట్లలో ఈ బిల్లుల విడుదల సరిగా లేదని సమాచారం. రామగుండంలో ఐదు నెలలుగా, కరీంనగర్‌లో రెండు నెలలుగా, జగిత్యాలలో ఆరు నెలలుగా, సిరిసిల్లలో కేవలం నెలరోజులుగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని ఆయా యూనిట్ల సిబ్బంది తెలిపారు.



ప్రణాళికాబద్ధంగా స్వచ్ఛదనం-పచ్చదనం



ముస్తాబాద్‌లో ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, కేకే మహేందర్‌రెడ్డి

- సంపూర్ణ పరిశుభ్రత, పచ్చదనమే లక్ష్యం
- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా
- ముస్తాబాద్‌లో భారీ ర్యాలీ

ముస్తాబాద్(సిరిసిల్ల): స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని ప్రణాళికాబద్ధంగా నిర్వహించి రాష్ట్రంలోనే జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా కోరారు. ముస్తాబాద్‌లో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని కాంగ్రెస్ సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డితో కలిసి సోమవారం ప్రారంభించి, కొత్తబస్టాండ్ నుంచి మేజర్ పంచాయతీ కార్యాలయం వరకు ర్యాలీలో పాల్గొన్నారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మాట్లాడుతూ జిల్లాలో ప్రతీ ఇల్లు, గ్రామం స్వచ్ఛంగా ఉండాలని, పచ్చగా కళకళలాడాలన్నారు. సంపూర్ణ పరిశుభ్రత, పచ్చదనమే లక్ష్యంగా ఈనెల 5 నుంచి 9 వరకు ఈ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యం పనులు చేయాలని, పచ్చదనం పెంపునకు విరివిగా మొక్కలు నాటాలని కోరారు. కాంగ్రెస్ సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ అడవుల విస్తీర్ణం తగ్గి కోతులు గ్రామాల్లోకి వస్తున్నాయన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనంతో ఆరోగ్య తెలంగాణ సాధ్యమన్నారు. డీపీవో వీరబుచ్చయ్య, డీఆర్‌డీవో శేషాద్రి, డీఈవో రమేశ్‌కుమార్, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, తహసీల్దార్ సురేశ్, ఎంపీడీవో రాజేందర్, ప్రత్యేకాధికారి లత, మాజీ ప్రజాప్రతినిధులు శ్రీనివాస్‌గౌడ్, గజ్జెల రాజు, అంజన్‌రావు, తలారి నర్సింలు, రాజిరెడ్డి, రాంరెడ్డి, తిరుపతి, కొండల్‌రెడ్డి, మహేశ్‌రెడ్డి, దీటి నర్సింలు, నరేశ్, భాను, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ముస్తాబాద్‌లో సమస్యలు పరిష్కరించాలని కేకే మహేందర్‌రెడ్డి, ఇతర నాయకులు కోరగా.. కలెక్టర్ స్పందించారు. మానేరు కెనాల్‌లోకి మురుగు నీరు చేరి పంట పొలాలు నాశనమవుతున్నాయని చెప్పగా కలెక్టర్ కెనాల్‌ను పరిశీలించి ప్రత్యేక డ్రెయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జూనియర్ కళాశాల, కస్తూర్బా స్కూల్‌ను సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. కళాశాలలో 20 ఏళ్లుగా పనిచేస్తున్న మలయ్యకు ఉద్యోగాన్ని ఇవ్వాలని మహేందర్‌రెడ్డి కోరగా.. వెంటనే అక్కడికక్కడే ఉద్యోగాన్ని కల్పిస్తూ లెటర్ ఇచ్చారు. డిగ్రీ కళాశాల మంజూరుకు ప్రభుత్వానికి లేఖ రాస్తామని హామీ ఇచ్చారు. డంపింగ్‌యార్డును పరిశీలించి, మరోచోటికి తరలించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఆరు గంటలకు పైగా కలెక్టర్ ముస్తాబాద్‌లోనే ఉండి సమస్యలను తెలుసుకున్నారు.

చందుర్తి సింగిల్‌విండోలో విచారణ

సాక్షి ఎఫెక్ట్

చందుర్తి(వేములవాడ): చందుర్తి సింగిల్‌విండోలోని అవకతవకలపై కేడీసీసీబీ జనరల్ మేనేజర్ జి.శ్రీధర్, జిల్లా సహకార సంఘం వెరిఫికేషన్ అధికారి ఎండీ సఫీయొద్దీన్ సోమవారం విచారణ చేపట్టారు. ఈనెల 4న 'సాక్షి'లో 'సహకారంలో స్వాహాపర్వం' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సొసైటీ పరిధిలో గల 8 గ్రామాల్లో ఎంత మంది రైతుల పేరిట రుణం తీసుకున్నారన్న కోణంలో విచారణ చేపట్టారు. రుణం తీసుకున్న రైతుల సంఖ్య 500లకు పైగా ఉండడంతో విచారణకు వారం రోజులు పట్టే అవకాశం ఉందని విచారణ అధికారి సఫీయొద్దీన్ తెలిపారు. క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టిన తర్వాతే పూర్తి వివరాలు వెల్లడిస్తామని స్పష్టం చేశారు. చందుర్తి, రుద్రంగి కేడీసీసీబీ మేనేజర్‌లు అజయ్, రమేశ్, చందుర్తి సింగిల్‌విండో సీఈవో గంగారెడ్డి ఉన్నారు.



విచారణ చేస్తున్న అధికారులు

మార్కెట్‌తో పోటీపడాలి



మాట్లాడుతున్న విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

- వస్త్రపరిశ్రమ యథావిధిగా కొనసాగాలి
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- పవర్‌లూమ్ యజమానులతో సమావేశం

సిరిసిల్ల: మార్కెట్‌లో డిమాండ్ ఉన్న వస్త్రాన్ని ఉత్పత్తి చేయాలని, మార్కెట్‌లో పోటీ పడి వ్యాపారం సాగించాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం రాత్రి కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సమక్షంలో పవర్‌లూమ్ యజమానులు, ఆసాములు, కార్మిక నాయకులు, 'సెస్' చేనేత, జౌళిశాఖ అధికారులతో సమావేశమయ్యారు. ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వస్త్రోత్పత్తి ఆర్డర్లు వస్తాయని, వాటిపైనే ఆధారపడకుండా సొంత మార్కెట్‌ను అభివృద్ధి చేసుకోవాలన్నారు. నాణ్యమైన వస్త్రాన్ని ఉత్పత్తి చేస్తూ ముందుకుసాగాలన్నారు. గతంలో మాదిరిగానే పరిశ్రమ కొనసాగాలన్నారు. 'సెస్'కు బకాయి ఉన్న విద్యుత్ సబ్సిడీ బిల్లులు చెల్లించాలని సూచించారు. 'సెస్' చైర్మన్ చిక్కాల రామారావు, ఎండీ రవీందర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ దేవరకొండ తిరుపతి, డైరెక్టర్లు లక్ష్మీనారాయణ, సుధాకర్, అంజిరెడ్డి, హరిచరణ్‌రావు, చేనేత, జౌళిశాఖ ఏడీ సాగర్, పద్మశాలీ సంఘం పట్టణాధ్యక్షుడు వెంకటరమణ, వస్త్రోత్పత్తిదారులు దామోదర్, భాస్కర్, రవి, శ్రీనివాస్, సత్యం, లక్ష్మీనారాయణ, మధు, శ్రీధర్, ఎల్లయ్య, దామోదర్, అశోక్, ప్రసాద్ పాల్గొన్నారు.

పోలీసుల తీరుపై న్యాయవాదుల నిరసన

- సిరిసిల్లలో ర్యాలీ, విధుల బహిష్కరణ



సిరిసిల్లకల్చరల్: ఐదు రోజులుగా విధులు బహిష్కరించిన సిరిసిల్ల న్యాయవాదులు సోమవారం జిల్లా న్యాయస్థానం నుంచి ప్రెస్‌క్లబ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిరిసిల్లకు చెందిన సీనియర్ న్యాయవాది ఒకరు తన భూమిని కాపాడుకునేందుకు కోర్టు నుంచి తెచ్చుకున్న ఇంజక్షన్ ఆర్డర్‌ను తంగళ్లపల్లి ఎస్సై సుధాకర్ ఏ మాత్రం లెక్కచేయకపోగా కక్షిదారుపైనే మరో రెండు కేసులు విధించారన్నారు. ఎస్సై తీరును నిరసిస్తూ సదరు న్యాయవాది బార్ అసోసియేషన్‌కు ఫిర్యాదు చేయడంతో విధుల బహిష్కరణకు పిలుపునిచ్చినట్లు పేర్కొన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దోర్నాల సంజీవరెడ్డి, అడ్వకేట్ల సంఘం కార్యదర్శి తంగళ్లపల్లి వెంకట్ పాల్గొన్నారు.



ఆయారే తీజ్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): గిరిజనుల సంప్రదాయ పండుగ తీజ్‌కు తండాలు సిద్ధమయ్యాయి. ఉపాధి, ఉద్యోగాల కోసం ఎక్కడెక్కడో స్థిరపడ్డ వారంతా తండాల బాట పట్టారు. పెళ్లికాని యువతులు గోధుమనారు పెంచేందుకు బుట్టలు, ఇతరత్ర సామగ్రితో సిద్ధంగా ఉన్నారు. నేటి నుంచి శ్రావణమాసం మొత్తం గిరిజన తండాలు తీజ్ వేడుకలతో సందడిగా మారనున్నాయి.

- వివరాలు 8లో..

ప్రజా'వాణి'పై నిర్లక్ష్యం వద్దు

- అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్
- దరఖాస్తుల పరిష్కారంపై అధికారులకు సూచనలు
- వివిధ సమస్యలపై 112 దరఖాస్తులు

సిరిసిల్లటౌన్: ప్రజావాణికి వచ్చిన అర్జీలపై నిర్లక్ష్యం వహించకుండా వెంటనే పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్ సూచించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మాట్లాడారు. 'ప్రజావాణి'కి వచ్చే అన్ని దరఖాస్తులు, ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలన్నారు. ఒక్క అర్జీ కూడా పెండింగ్‌లో ఉండొద్దన్నారు. సమస్య ఎందుకో పరిష్కారం కాలేదో అర్జీదారునికి లిఖిత పూర్వకంగా అందివ్వాలని సూచించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తమ కష్టాలపై 112 ఫిర్యాదులు అందించారు. ఆర్డీవోలు రమేశ్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్

నా జాగలో కంకర రోడ్డేసింద్రు



నాకు పెద్దూరు సమీపంలో ఎకరం ఇరవై గుంటల స్థలం ఉంది. అందులో బోరు బావి ద్వారా వ్యవసాయం చేసుకునేటోన్ని. నాపైసలతో ఐదు కరెంటు పోల్స్ వేయించుకున్న. మున్సిపాలిటోళ్లు దానిలో కంకర వేసింద్రు. నాకున్న ఏకైక ఆధారం ఆ స్థలం. ఇది వరకు కూడా ఫిర్యాదు చేసినా నాకు న్యాయం జరుగలేదు.

– పుష్పాల వెంకట్, పెద్దూరు

మనవరాలి గుండె చికిత్సకు సాయం చేయండి



ఎనిమిదేళ్ల వయసున్న మా మనవరాలికి గుండెలో రంధ్రం ఉంది. తరచూ అనారోగ్యంతో బాధపడుతుంది. ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స అందిస్తామంటే రేషన్‌కార్డులో పేరు లేదు. చికిత్స చేయిద్దామంటే డబ్బుల్లేవు. రేషన్‌కార్డులో మనవరాలి పేరును ఎక్కించి ఆర్థిక సాయం అందించాలి. ఆరోగ్యశ్రీ వర్తించేలా చేయాలి.

– భూక్య గౌరి-రాజు, మద్దిమల్ల

కోతుల నుంచి రక్షించాలి



ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లిలో కోతుల బారి నుంచి గ్రామస్తులను రక్షించాలి. వారం రోజుల నుంచి 20 మందిని కోతులు కరిచాయి. మహిళలు బయటకు రాలేక పోతున్నారు. కోతుల నివారణకు చర్యలు తీసుకోవాలి.

– దాసరి పూర్ణిమ, గొల్లపల్లి

ఉపాధి కల్పించండి సారూ..



నేను బీఈడీ వరకు చదివాను. నా భర్త ఉపాధి కోసం గల్ఫ్ వెళ్తే కంపెనీ మంచిదికాకపోవడం డబ్బులు పంపడం లేదు. మా నాన్న సుతారి పని చేస్తూ కొద్దిరోజుల క్రితం చనిపోయారు. నాకు ఇద్దరు పిల్లలు. వారిని ప్రభుత్వ బడిలో చదివిస్తున్నాను. పెద్దకుటుంబం భారం నాపైనే పడింది. గతంలో విద్యా వలంటీర్‌గా పనిచేసిన నాకు ఏదైనా ఉపాధి కల్పించాలి.

– నాగమణి, గర్జనపల్లి

మా స్థలాన్ని ఇతరులకు చేశారు



మా నాన్న, పెద్దనాన్న తాతల పేరుతో గ్రామంలో సర్వేనంబరు 547లో సర్వే నంబర్లు 198, 199లో 4 గుంటలు స్థలం ఉంది. మా నాన్న చేపూరి నర్సయ్య సర్వేనంబరు 547లోనే గుంటన్నర స్థలాన్ని కొనుగోలు చేయగా ఇంటిని నిర్మించాం. భూప్రక్షాళనలో భాగంగా ఇతరుల పేరిట మారింది. మాస్థలంపై పట్టాను అందించాలి.

– చేపూరి రమేశ్, తడగొండ

రైతు రుణమాఫీ కాలేదు



ప్రభుత్వం చేసిన రుణమాఫీ నాకు అందలేదు. గతంలో నేను ఉపాధి కోసం గల్ఫ్ దేశానికి పోయిన. వచ్చేసరికి రేషన్‌కార్డులో పేరు తొలగించారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పేరు నమోదు కాలేదు. నాకు పంట రుణం రూ.1.03 లక్షలు ఉంది. రేషన్‌కార్డులో పేరు చేర్చి రుణమాఫీ వర్తించేలా చేయాలి.

– జక్కు వెంకటి, మల్లారెడ్డిపేట

క్లుప్తంగా

వ్యాపారంలో నష్టంతో ఆత్మహత్య


లక్ష్మీరాజం (ఫైల్)

సిరిసిల్లక్రైం: వ్యాపారంలో నష్టం రావడంతో మానసిక వేదనకు గురైన యువ వ్యాపారి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సిరిసిల్లలో సోమవారం విషాదం నింపింది. పోలీసులు తెలిపిన వివరాలు. రాజన్నసిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలానికి చెందిన కొండ లక్ష్మీరాజం(39) ప్రస్తుతం సిరిసిల్లలో నివసిస్తున్నాడు. 2023లో తన స్నేహితుడితో కలిసి గాంధీనగర్ మార్కెట్ ఏరియాలో అన్‌లిమిటెడ్ ఫుడ్‌జోన్ రెస్టారెంట్‌ను ప్రారంభించారు. వ్యాపారం సరిగ్గా నడవక నష్టం రావడంతో దాని స్థానంలో పానీపూరి, బేకరీ షాప్‌ను తెరిచారు. అది కూడా సరిగ్గా నడవక నష్టాలు వచ్చాయి. రెండు వ్యాపారాల్లోనూ నష్టాలు రావడంతో మానసికంగా కుంగిపోయిన లక్ష్మీరాజం సోమవారం షాపులోని కిచెన్‌లో ఉరివేసుకున్నాడు. మృతునికి భార్య వైశాలి, పదేళ్లలోపు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

యువకులకు గంజాయి పరీక్షలు

చందుర్తి(వేములవాడ): గంజాయి సేవిస్తున్నారన్న అనుమానంతో చందుర్తిలోని యువకుల శాంపిల్స్‌ను స్థానిక పోలీసులు సోమవారం పరీక్షించారు. మండల కేంద్రానికి చెందిన నలుగురు యువకులు గంజాయి సేవిస్తున్నారని పేర్లతో సహ సమాచారం అందడంతో వారిని అదుపులోకి తీసుకుని పరీక్షలు నిర్వహించగా నెగెటివ్ రావడంతో వదిలిపెట్టారు. చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గంజాయి సేవించేవారిని, విక్రయించే వారిపై పోలీసు శాఖ దృష్టి పెట్టిందన్నారు. యువత మత్తుకు అలవాటు పడి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని కోరారు. ఎస్సై శ్రీకాంత్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

కార్మికులకు ఉపాధి కల్పించాలి



సిరిసిల్లఅర్బన్: స్థానిక కార్మికులకు ఉపాధి కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు అన్నారు. పట్టణంలోని ఏఐటీయూసీ కార్మిక భవనంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఐకేపీ, ప్యాక్స్‌లలో పనిచేసే హమాలీలు వలస వెళ్లకుండా పనిచేస్తున్నారని వారు పేర్కొన్నారు. కొందరు ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులను తీసుకువచ్చి ఇక్కడి కార్మికుల కడుపు కొడుతున్నారని వారు ఆవేదన వ్యక్తంచేశారు. కార్మికులకు ప్రమాదబీమా, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కదారి రాములు, బచ్చుపల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆయారే తీజ్


నారు బుట్టలతో యువతులు

- నేటి నుంచి తండాల్లో వేడుకలు
- తొమ్మిది రోజుల సందడి
- గోధుమనారుకు నిష్టతో యువతుల పూజలు
- చివరి రోజు నిమజ్జనం
- ఏటా మంగళవారం నిర్వహించాలని నిర్ణయం



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): గిరిజనతండాలు తీజ్ వేడుకలకు ముస్తాబయ్యాయి. పెళ్లీడుకొచ్చిన గిరిజన యువతులు ఎదురుచూస్తున్న వేడుకకు వేళైంది. నచ్చిన వరుడు రావాలని కోరుతూ యువతులు భక్తితో కొలిచే తీజ్ ఉత్సవాలు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మంగళవారం నుంచి ప్రారంభమవుతున్నాయి. తరతరాలుగా గిరిజనులు తమ సంస్కృతి, సంప్రదాయాలను పాటిస్తూ తీజ్ వేడుకలు నిర్వహించడం ఆనవాయితీ. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని గిరిజన జనాభా అధికంగా ఉన్న వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, చందుర్తి, కోనరావుపేట, రుద్రంగి ముస్తాబాద్, బీర్‌పూర్, సారంగాపూర్ మండలాల్లో ఈ వేడుకలు నిర్వహిస్తుంటారు. బంజారాల భాషలో తీజ్ అంటే ఎర్రని ఆరుద్ర, నారు* అనే రెండు అర్థాలు.

అసలేరు కార్తెలో


పందిరిపై నారుకు నీరు పోస్తున్న యువతులు

శ్రావణ మాసం అసలేరు కార్తె ప్రారంభంకాగానే మొదటి వారం నుంచి నెల రోజుల పాటు తండాల్లో తీజ్ వేడుకలు నిర్వహిస్తుంటారు. తండాలోని పెద్దమనిషి ఇంటి ఎదుట ప్రత్యేకంగా పందిరిని ఏర్పాటు చేస్తారు. పెళ్లికాని యువతులు తండా పెద్దమనిషి సహాయంతో బుట్టలు కొనుగోలు చేసి ప్రత్యేకంగా అలంకరించి, మట్టి పోసి గోధుమలు చల్లుతారు. ఈ బుట్టలను పందిరిపై ఉంచుతారు. తండాలోని యువతులు బుట్టలపై రోజుకు మూడు సార్లు నీరు పోస్తుంటారు. ఇలా తొమ్మిది రోజులు కొలిచే క్రమంలో యువతులు రోజుకు ఒక్కపూట మాత్రమే భోజనం చేస్తారు.

గోధుమ నారుతో ఊరేగింపు

తొమ్మిదో రోజు మొలకెత్తిన గోధుమనారు బుట్టలతో యువతులు ఊరేగింపు నిర్వహిస్తారు. అంతకు ముందు సేవాలాల్, జగదాంబ అమ్మవార్లకు నైవేద్యం సమర్పిస్తారు. పందిరిపై ఉన్న గోధుమనారు బుట్టలను కిందికి దింపి తండా కూడలి వద్ద పెట్టి చుట్టూ తిరుగుతూ సంప్రదాయ నృత్యాలు చేస్తుంటారు. అనంతరం ఆ బుట్టలను నెత్తిపై పెట్టుకొని ఊరేగింపుగా సమీపంలోని వాగు వద్దకు వెళ్లి నిమజ్జనం చేస్తారు. ప్రతీ మంగళవారం తండాల్లో తీజ్ వేడుకలు నిర్వహించాలని గిరిజన పెద్దలు నిర్ణయించారు.

మంచి వరుడు వస్తాడని..



తొమ్మిది రోజులపాటు నిష్ఠతో పూజలు చేస్తే మంచి వరుడు వస్తాడనేది నమ్మకం. ప్రతీ శ్రావణమాసంలో తీజ్ జరుపుకుంటాం. ఉపాధి, ఉద్యోగాల కోసం పట్టణాలకు వెళ్లిన వారు సైతం తండాలకు వస్తారు. కుటుంబ సభ్యులు, పాడి పశుసంపద బాగుండాలని జగదాంబ అమ్మవారిని పూజిస్తాం.

– అజ్మీరా రజిత, బుగ్గరాజేశ్వరతండా

ప్రత్యేకమైన వేడుక



శీత్లా భవాని వేడుకలు ముగియగానే శ్రావణమాసం అసలేరు కార్తెలో తీజ్ వేడుకలు ప్రారంభమవుతాయి. ఇది ప్రత్యేకమైన పండుగ. జిల్లాలోని 132 తండాల్లో శ్రావణమాసం అంతా వేడుకలు నిర్వహించుకోవడం ఆనవాయితీ. ఆగస్టులో నాలుగు వారాలపాటు తండాల్లో పండుగ జరుపుకుంటారు.

– భూక్య గజన్‌లాల్, బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు

నెల రోజులు పండుగే..



నిష్టతో పూజలు చేస్తే కోరికలు నెరవేరుతాయని నమ్మకం. నైవేద్యాలను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పిస్తాం. నిష్టతో పూజలు చేసిన యువతులకు మంచి వరుడు దొరికిన సందర్భాలు చాలా ఉన్నాయి. నెల రోజులపాటు తండాల్లో పండుగ వాతావరణం ఉంటుంది.

– గుగులోతు కళావతి, మాజీ జెడ్పీటీసీ, వీర్నపల్లి

రాజన్న భక్తులకు బ్రేక్ దర్శనాలు

- లాంఛనంగా ప్రారంభించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


బ్రేక్ దర్శనాలు ప్రారంభిస్తున్న ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్, ఈవో వినోద్‌రెడ్డి

వేములవాడ: రాజన్న ఆలయంలో తొలిసారిగా బ్రేక్ దర్శనాలను అందుబాటులోకి తెచ్చినట్లు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. శ్రావణమాసం మొదటి సోమవారం పురస్కరించుకుని ఆలయంలో ఒక్కొక్కరికి రూ.300 టికెట్‌పై భక్తులకు బ్రేక్ దర్శనాలను ప్రారంభించి మాట్లాడారు. యాదాద్రి, తిరుమల తిరుపతి దేవస్థానాల తరహాలో వేములవాడ రాజన్న ఆలయంలో వీఐపీలు, భక్తులకు త్వరగా స్వామి వారి దర్శనం కలిగేలా ఈ అవకాశాన్ని కల్పించినట్లు పేర్కొన్నారు. గత పాలకులు రాజన్న ఆలయానికి బడ్జెట్‌లో రూ.100 కోట్లు ఇస్తామని మోసం చేస్తే తమ ప్రభుత్వం ఏర్పడిన మొదటి మూడు నెలల్లోనే వీటీడీఏ సమావేశం ఏర్పాటు చేసి వెనక్కిమళ్లిన రూ.20కోట్లను తీసుకొచ్చామన్నారు. ఈసారి బడ్జెట్‌లో ఆలయ అభివృద్ధికి రూ.50కోట్లు కేటాయించిన విషయాన్ని గుర్తు చేశారు. త్వరలోనే దేవాదాయశాఖ అధికారులు రాజన్న ఆలయానికి చేరుకుని అంచనాలకు అనుగుణంగా ఆలయ విస్తీర్ణం చేపడతారని తెలిపారు. ఇటీవల శృంగేరి పీఠానికి వెళ్లిన సందర్భంలో రాజన్న ఆలయం అభివృద్ధి, విస్తరణపై చర్చించినట్లు పేర్కొన్నారు. ఆధ్యాత్మిక చింతన ఉట్టిపడేలా ఆలయాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. మిగతా భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ప్రతిరోజు ఉదయం 10.15 నుంచి 11.15 గంటల వరకు, సాయంత్రం నాలుగు 4 నుంచి 5 గంటల వరకు బ్రేక్ దర్శనాలు కొనసాగనున్నాయన్నారు. ఇందుకు ఒక్కో భక్తుడు రూ.300 చెల్లిస్తే ఈ–టికెట్ అందజేస్తారని, ఒక్కో టికెట్‌పై ఒక లడ్డూ ఉచితంగా అందజేస్తామన్నారు. కోడె టికెట్ సైతం అదనంగా రూ.200 చెల్లిస్తే ఇక్కడే ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మొత్తంగా రూ.500 చెల్లిస్తే బ్రేక్ దర్శనం, కోడెటికెట్ అందజేస్తామని ఈవో కొప్పుల వినోద్‌రెడ్డి తెలిపారు. ఆలయంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పారిశుధ్య నిర్వహణ, మంచినీటి వసతి, ఇతర సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఈఈ రాజేశ్, డీఈ రఘునందన్, మున్సిపల్ వైస్‌చైర్మన్ బింగి మహేశ్ పాల్గొన్నారు.

నాణ్యతకు భరోసా భారతి సిమెంట్

- సంస్థ మార్కెటింగ్ ఉపాధ్యక్షుడు ఎంసీ మల్లారెడ్డి
- కరీంనగర్‌లో డీలర్ల సమావేశం


జ్యోతిప్రజ్వలన చేస్తున్న మల్లారెడ్డి, కొండాల్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, సునీల్

కరీంనగర్‌రూరల్: నాణ్యతతోపాటు ప్రజల్లో నమ్మకానికి భరోసాగా భారతి సిమెంట్ ప్రత్యేకమైన గుర్తింపు పొందినట్లు ఆ సంస్థ మార్కెటింగ్ ఉపాధ్యక్షుడు ఎంసీ మల్లారెడ్డి తెలిపారు. సోమవారం కరీంనగర్‌లోని శ్వేత కాన్ఫరెన్స్‌హాల్లో భారతి సిమెంట్ జిల్లా డీలర్ల సమావేశాన్ని ఆయన జ్యోతిప్రజ్వలన చేసి, ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భారతి సిమెంట్ ఉత్పత్తి ప్రారంభించినప్పటి నుంచి వినియోగదారుల నమ్మకాన్ని పొందినట్లు పేర్కొన్నారు. జర్మన్ టెక్నాలజీ, రోబోటిక్ ల్యాబోరేటరీ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సిమెంట్‌ను ఉత్పత్తి చేస్తున్నట్లు తెలిపారు. మార్కెట్‌లో భారతి సిమెంట్‌కు విశేషమైన ఆదరణ లభిస్తోందన్నారు. తాపీమేస్త్రీలకు సంస్థ ద్వారా వ్యక్తిగత ప్రమాద బీమా పథకం అమలు చేస్తూ వారిని ఆదుకుంటున్నామని వివరించారు. అనంతరం ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా భారతి సిమెంట్ కంపెనీలో సిమెంట్ ఉత్పత్తి, ప్యాకింగ్, లోడింగ్ తదితర అంశాలపై డీలర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ సహ ఉపాధ్యక్షుడు టి.కొండాల్‌రెడ్డి, డీజీఎం(టెక్నికల్ సర్వీసెస్) సి.ఓబుల్‌రెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ వి.నాగేశ్వర్‌రావు, టెక్నికల్ సర్వీసెస్ మేనేజర్ కె.సునీల్ పాల్గొన్నారు.

ప్రకృతి ప్రేమికుడికి రాష్ట్రస్థాయి పురస్కారం


అవార్డు అందుకుంటున్న ప్రకాశ్

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని సుద్దాలకు చెందిన ప్రకృతి ప్రకాశ్ రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్నారు. హరితమిత్ర అవార్డు గ్రహీత దైద వెంకన్న ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని మానుకోట ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పర్యావరణ ప్రేమికుల సదస్సుకు రాష్ట్రంలోని ప్రకృతి ప్రేమికులు హాజరయ్యారు. పర్యావరణ పరిరక్షణకు కృషిచేస్తున్న ప్రకృతి ప్రకాశ్ సేవలను గుర్తించి రాష్ట్రస్థాయి సేవాపురస్కారం అందించారు. మహబూబాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, మొక్కల వెంకటయ్య, వీరస్వామి, డాక్టర్ కె.కమలారాణి, చేతులమీదుగా పురస్కారం అందజేశారు.

కాలుష్యం వెదజల్లుతుంటే ఏం చేస్తున్నారు?

- గ్రానైట్ పరిశ్రమలపై సర్కార్‌కు హైకోర్టు నోటీసులు

సాక్షి,హైదరాబాద్: కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం ఆసిఫ్‌నగర్‌లో గ్రానైట్ అక్రమ తవ్వకాలు, నిబంధనలు పాటించకుండా కాలుష్యం వెదజల్లుతుండటంపై ఏంచర్యలు తీసుకున్నారో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణలోగా కౌంటర్ దాఖలుచేయాలని అధికారులకు నోటీసులు జారీచేసింది. ×కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం ఆసిఫ్‌నగర్‌లో గ్రానైట్ క్వారీలతో పరిసర ప్రాంతాల్లో పర్యావరణం అధ్వానంగా మారింది. అక్కడి ప్రజల జీవితాలు దుర్భరంగా మారుతున్నాయి. విచ్చలవిడిగా, అక్రమంగా గ్రానైట్ తవ్వకాలతో పాటు అనుబంధ పరిశ్రమలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తుండటంతో పర్యావరణ కాలుష్యం అంతకంతకు పెరిగిపోతోంది. గ్రానైట్, స్టోకటింగ్, పాలిషింగ్ యూనిట్లతో గాలి మాత్రమే కాకుండా నీరు, ధ్వనికాలుష్యం పెరిగిపోయింది. పరిశ్రమల నుంచి వెలువడే ధూళి కారణంగా చుట్టుపక్కల గ్రామాల్లో పచ్చదనం అన్నదే మాయమైంది. 40 వేల కుటుంబాలతో పాటు జంతువులు కూడా శ్వాసపీల్చుకోవడానికి ఇబ్బందిపడుతున్నాయి®అని ప్రధాన న్యాయమూర్తికి కరీంనగర్‌వాసి డి.అరుణ్‌కుమార్ రాసినలేఖను హైకోర్టు సుమోటోగా విచారణకు నిర్ణయించింది. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు జూకంటి ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. పిటిషన్‌ను పరిశీలించిన ధర్మాసనం..ప్రభుత్వ ప్రధానకార్యదర్శి, గనులు, పరిశ్రమలు, వాణిజ్య, పర్యావరణ, అటవీశాఖల ముఖ్యకార్యదర్శులతో పాటు కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శి, కలెక్టర్ తదితరులకు నోటీసులు జారీచేసింది.

రేపు జాతీయ చేనేత దినోత్సవం

సిరిసిల్ల: సిరిసిల్లలో బుధవారం జాతీయ చేనేత దినోత్సవం నిర్వహిస్తున్నామని చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకుడు మిట్టకోల సాగర్ సోమవారం తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటలకు బీ.వై.నగర్‌లోని జౌళిశాఖ ఆఫీస్ నుంచి పాతబస్టాండులోని నేతన్నచౌక్ వరకు ర్యాలీ నిర్వహిస్తామని, నేతన్న విగ్రహానికి పూలమాలలు వేసి, షాదీఖానాలో సమావేశం ఏర్పాటు చేసినట్లు వివరించారు. చేనేతకార్మికులను సన్మానించనున్నట్లు తెలిపారు.

హాస్టళ్లలో వసతులు కల్పించాలి



సిరిసిల్లటౌన్: ప్రభుత్వం హాస్టళ్లలో చదివే విద్యార్థులపై చిన్నచూపు చూస్తోందని బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ ఆరోపించారు. సోమవారం తెలంగాణ భవనస్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించకుండా రాళ్ల అన్నం.. నీళ్లచారు వడ్డించడం ఏంటన్నారు. హాస్టళ్లలో వసతులు కల్పించాలని కోరారు. లేపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. మట్టె శ్రీనివాస్, వెంకటేశ్, కరుణాకర్, శ్రీనివాస్, అరవింద్, సాయి పాల్గొన్నారు.

గల్ఫ్ ప్రవాసీల కోసం ప్రజావాణి

ముస్తాబాద్(సిరిసిల్ల): గల్ఫ్ ప్రవాసుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రజావాణిని ప్రత్యేకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసిందని కాంగ్రెస్ ఎన్‌ఆర్‌ఐ సెల్ జిల్లా అధ్యక్షుడు తోట ధర్మేందర్ సోమవారం ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ప్రతీ మంగళ, శుక్రవారాల్లో గల్ఫ్ సమస్యలను తెలుసుకునేందుకు ప్రజావాణిని నిర్వహిస్తారన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గల్ఫ్ ప్రవాసీలు తమ సమస్యలను తెలియజేయవచ్చన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిరసనలతో దద్దరిల్లిన కలెక్టరేట్


కలెక్టరేట్ ఎదుట ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక సమితి ధర్నా

సిరిసిల్ల/సిరిసిల్లటౌన్: జిల్లా కలెక్టరేట్ నిరసనలు నినాదాలు హోరెత్తింది. ప్రజాసంఘాలు సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళనలు చేపట్టాయి. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునర్విమర్శించాలని కోరుతూ ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. జిల్లా అధ్యక్షుడు రొడ్డ రాంచంద్రం, సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాలుక సత్యం, నీరటి శ్రీనివాస్, మంగ కిరణ్, పర్శరాములు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

పెండింగ్ స్కాలర్‌షిప్స్, రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్ కోరారు. కలెక్టరేట్ ఎదుట పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పథకాన్ని అమలు చేయాలని, బాలుర విద్యార్థులకు కూడా ఉచిత బస్సు పాస్ సౌకర్యం కల్పించాలని కోరారు. పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు ముల్కల మారుతి, అరుణ్, శివప్రసాద్, సోహిదల్, వరుణ్‌కుమార్, అభిలాశ్, రాకేశ్, భార్గవ్, సంజయ్ పాల్గొన్నారు.

విన్నపాలు ఆలకించండి

కులగణన చేపట్టిన తర్వాతే ఎస్సీ వర్గీకరణ చేయాలని ఎస్సీ ఉపకులాల ప్రతినిధులు అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్‌కు విన్నవించారు. రైల్వేలైన్‌లో విలువైన భూములు కోల్పోతున్నామని పరిహారం ఇవ్వాలని వేములవాడ మున్సిపాలిటీ పరిధిలోని నాంపల్లి, కొడుముంజ, శాత్రాజుపల్లి, అయ్యోరుపల్లి గ్రామాల పేదలు విన్నవించారు. గుంటకు రూ.20లక్షలు చెల్లించాలని, పునరావాస కాలనీలు ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లాలోని కార్మికులను ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్‌కు వినతిపత్రం ఇచ్చారు. గంభీరావుపేట మేజర్ గ్రామ పంచాయతీలో ఈవోను నియమించాలని ఆ గ్రామస్తులు కోరారు ఈమేరకు అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. రాయల లక్ష్మీనర్సయ్య, గడ్డం ధనుంజయ, మేడిపల్లి శ్రీని వాస్, ఈశ్వర్, మధు, రాజశేఖర్, బాబు, శ్రీనివాస్, బాలయ్య, దేవేందర్, ఎగమంటి ఎల్లారెడ్డి, అన్నల్‌దాస్ గణేశ్, రాచర్ల పార్థసారథి, రాజేశ్, మురళి, శివ పాల్గొన్నారు.

జిల్లా సరిహద్దు అటవీలో చిరుత సంచారం

- పశువులపై దాడి
- నిన్న గోరింటాల.. నేడు దమ్మన్నపేటలో
- భయాందోళనలో రైతులు


దమ్మన్నపేటలో చిరుతదాడిలో మృతి చెందిన గేదె

గంభీరావుపేట(సిరిసిల్ల): రాజన్నసిరిసిల్ల, కామారెడ్డి జిల్లాల సరిహద్దు గంభీరావుపేట మండలం పెద్దమ్మ అటవీ ప్రాంతంలో చిరుత సంచరిస్తున్నట్లు అధికారులు ధ్రువీకరిస్తున్నారు. రెండు రోజుల క్రితం మండలంలోని గోరింటాలలో రెండు ఆవులపై చిరుత దాడి చేసి చంపింది. తిరిగి సోమవారం దమ్మన్నపేటలో ఈరవేని నారాయణ అనే రైతు గేదెపై చిరుత దాడి చేసి చంపింది. అటవీశాఖ అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించి చిరుత ఆనవాళ్లను గుర్తించారు. దీంతో సరిహద్దు అటవీ గ్రామాల రైతులు, ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. పొలాల వద్దకు వెళ్లాలంటేనే రైతులు జంకుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రజలకు చేరువలో పల్లె దవాఖానాలు

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


మల్లారంలో భూమిపూజ చేస్తున్న విప్ ఆది శ్రీనివాస్

వేములవాడరూరల్: గ్రామీణులకు ప్రభుత్వ వైద్యం అందుబాటులో ఉండాలని పల్లె దవాఖానాలు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. వేములవాడరూరల్ మండలం మల్లారం గ్రామంలో పల్లెదవాఖానాకు సోమవారం భూమిపూజ చేశారు. అనంతరం గ్రామంలో స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యంగా ఉంటామన్నారు. త్వరలోనే ఫీడర్ చానల్ సమస్య పరిష్కారమవుతుందని తెలిపారు. దివ్యాంగులకు ఉపకరణాలు అందించేందుకు ఈనెల 7న వేములవాడ మండల పరిషత్, 8న చందుర్తి రైతువేదికలో క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ సుజాత, డాక్టర్ దీప్తి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్, మాజీ ఎంపీపీ రంగు వెంకటేశ్ గౌడ్, సంగ స్వామి, సామ తిరుపతిరెడ్డి, సోయినేని కరుణాకర్, రొండి రాజు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దు



సిరిసిల్లటౌన్: సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యం సేవించి డ్రైవింగ్ చేయొద్దని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి ఆర్టీసీ డ్రైవర్లకు సూచించారు. సిరిసిల్ల ఆర్టీసీ డిపోలోని డ్రైవర్లకు జీరో యాక్సిడెంట్‌పై సోమవారం అవగాహన కల్పించారు. టీ–జంక్షన్లు, కార్నర్ రోడ్స్, స్పీడ్ బ్రేకర్లు ఉన్నచోట ముందుచూపుతో నడపాలని సూచించారు. డిపో మేనేజర్ ప్రకాశ్‌రావు, ఆర్టీసీ అధికారులు నక్క శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, రాంరెడ్డి, రాజమౌళి పాల్గొన్నారు.

నేత కార్మికులకు రూ.5వేల భృతి చెల్లించాలి



సిరిసిల్లటౌన్: ఏడు నెలలుగా పనుల్లేకుండా భారంగా గడుపుతున్న నేతకార్మికులకు రూ.5వేల భృతిని ప్రభుత్వం చెల్లించాలని ఏఐఎఫ్‌టీయూ న్యూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సోమిశెట్టి దశరథం కోరారు. సిరిసిల్లలో సోమవారం నేతకార్మికులతో ర్యాలీ చేపట్టి చేనేత, జౌళిశాఖ ఆఫీస్ ఎదుట వంటావార్పు చేపట్టారు. అక్కడే సహపంక్తి భోజనాలు చేశారు. తడక రాములు, దేవదాసు, ప్రవీణ్, సత్యనారాయణ, శ్రీధర్ తదితరులున్నారు.

రాజన్నకు శ్రావణ శోభ


కోడెమొక్కు చెల్లిస్తున్న ఏలేటి మహేశ్వర్‌రెడ్డి


ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు


రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ: రాజన్న సన్నిధిలో శ్రావణసందడి మొదలైంది. సోమవారం 20వేల మంది భక్తులు రాజన్నను దర్శించుకున్నారు. ఉదయం స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. ధర్మగుండంలో స్నానాలు చేసిన భక్తులు తమతమ మొక్కులు చెల్లించుకున్నారు. నిర్మల్ ఎమ్మెల్యే, బీజేపీ అసెంబ్లీ ఫ్లోర్‌లీడర్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో రాజన్నను దర్శించుకున్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, ప్రొటోకాల్ పర్యవేక్షకులు సిరిగిరి శ్రీరాములు, ఆలయ పర్యవేక్షకులు అల్లి శంకర్ తదితరులు ఉన్నారు.